సాక్షి సిద్దిపేట

గురువారం । 9 । అక్టోబర్ । 2025

చెరువు నీటి మధ్య వైకుంఠధామం



చెరువులో వైకుంఠం

వైకుంఠధామాలను గత ప్రభుత్వ హయాంలో ఊరూరా నిర్మించారు. కొన్ని వినియోగంలో ఉండగా మరికొన్ని నిరుపయోగంగా మారాయి. జగదేవ్‌పూర్ మండలంలోని అంతాయిగూడలో బతుకమ్మ చెరువు సమీపంలోనే వైకుంఠధామం నిర్మించగా, వర్షాకాలంలో చెరువు పూర్తి స్థాయిలో నిండటంతో దారి లేకుండా పోయిందని గ్రామస్తులు తెలిపారు. దీంతో నిరుపయోగంగా మారిందని వాపోయారు.

– జగదేవ్‌పూర్(గజ్వేల్)

న్యూస్‌రీల్

వార్షిక పరీక్షలకు సిద్ధంకండి

జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్ రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): వార్షిక పరీక్షలకు సమయం దగ్గరపడుతోందని, విద్యార్థులు సిద్ధం కావాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల హాజరు శాతం, కళాశాల పరిసరాలు, రికార్డులు, టీచింగ్ డైరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అధ్యాపకులు బోధించే ప్రతీ అంశాన్ని శ్రద్ధగా వినాలని, అర్థం కాకపోతే అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని అధ్యాపకులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు ఉన్నారు.

వ్యవసాయ రంగంలో మార్పులు అవశ్యం



క్షేత్ర పర్యటనలో డిగ్రీ కళాశాల విద్యార్థులు

హుస్నాబాద్: కృత్రిమ మేధను ఉపయోగించడం ద్వారా వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావచ్చని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భిక్షపతి అన్నారు. అక్కన్నపేట మండలం కుందనవాని పల్లెలో నాబార్డ్ సహకారంతో ఏర్పాటు చేసిన ఖేతీ రక్షక్ నెట్ హౌస్‌లో బుధవారం డిగ్రీ కళాశాల విద్యార్థులు క్షేత్ర పర్యటన చేశారు. కృత్రిమ మేధను ఉపయోగించి వ్యవసాయ పంటల పరిరక్షణ ఏ విధంగా చేయవచ్చో అగ్రిదూత్ అనే యాప్ సహ వ్యవస్థాపకుడు శాశ్వత రాజ్ వివరించారు. పంటలకు వచ్చే తెగుళ్లు, తేమ శాతం, శీతోష్ణస్థితి పరిస్థితులు మొదలైనవి ఒక క్లిక్‌తో తెలుసుకోవచ్చని యాప్ వినియోగాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి తస్లీమా, విస్తరణ అధికారి శ్రీలత, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో టెన్త్ మార్కులు కీలకం

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): భవిష్యత్తులో 10వ తరగతి పరీక్షల మార్కులే కీలకంగా మారనున్నాయని డీఈఓ ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కుకునూరుపల్లి హైస్కూల్‌లో టెన్త్ ప్రత్యేక తరగతుల నిర్వహణను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించేలా విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. కష్టంగా కాకుండా ఇష్టంగా చదివినప్పుడే మంచి ఫలితాలను సాధిస్తారన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా విద్యార్థులు కృషి చేయాలన్నారు. అంతకు ముందు టెన్త్‌లోని పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలడిగి సమాధానాలు రాబట్టారు. ఇటీవల జిల్లా స్థాయి జూనియర్ బాలికల కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనులపండువగా బొడ్రాయి ప్రతిష్ఠామహోత్సవాలు



విగ్రహాలకు జలాభిషేకం చేస్తున్న మహిళలు

దుబ్బాక: పట్టణంలో బొడ్రాయి(నాభిశిల) ప్రతిష్ఠామహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రధాన వీధుల గుండా విగ్రహాల శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు విగ్రహాలకు మంగళహారతులతో స్వాగతం పలికి గంగాజలంతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది.

బిడ్డా.. పైలం



హుస్నాబాద్‌లోని గురుకుల పాఠశాల గేటు బయటి నుంచే పిల్లలతో మాట్లాడుతున్న తల్లిదండ్రులు

కట్టుతప్పిన గురుకులాలు

- విద్యార్థి అనుమానాస్పద మృతితో తల్లిదండ్రుల్లో ఆందోళన
- గతంలో కొందరికి గాయాలు
- స్థానికంగా నిద్రించని ఉపాధ్యాయులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

హుస్నాబాద్‌రూరల్: 'బిడ్డా... పైలం భయపడకు. ఆదివారం బాపును పంపిస్తా' ఇది హుస్నాబాద్ గురుకుల పాఠశాల గేటు ఎదుట బుధవారం తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇలా ధైర్యం చెప్పారు. మంగళవారం 8వ తరగతి విద్యార్థి వివేక్ అనుమానాస్పదస్థితిలో మరణించిన విషయం విదితమే. దీంతో తల్లిదండ్రులు పిల్లల బాగోగులు తెలుసుకొనేందుకు గురుకులానికి పరుగులు తీశారు. పోలీసులు లోపలికి అనుమతించకపోవడంతో గేటు బయట నుంచే పిల్లలతో మాట్లాడారు.

బంగారు భవిష్యత్ ఉంటుందని..

గురుకుల పాఠశాలలో చేర్పిస్తే చదువులో ముందుంటారని, పిల్లలకు బంగారు భవిష్యత్ ఉంటుందని భావించి గురుకులంలో సీట్లు పొందడానికి పోటీపడతారు. ఉపాధ్యాయులు స్థానికంగా ఉండకపోవడంతో విద్యార్థులు క్రమశిక్షణ తప్పుతున్నారు.

ప్రమాద ఘటనలు కొన్ని..

- హుస్నాబాద్ బాలుర గురుకులంలో 2023 మార్చిలో టెన్త్ పరీక్షలు రాస్తున్న విద్యార్థి పై నుంచి దూకడంతో తీవ్ర గాయాలయ్యాయి.
- 2024 డిసెంబర్‌లో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థిని కొట్టడంతో తీవ్రగాయాలతో హైదరాబాద్‌లో చికిత్స పొందాడు. తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో కేసు పెడితే విద్యార్థికి టీసీ ఇచ్చి పంపించారు.
- 2025 అక్టోబర్‌లో తరగతి గది ముందు కారిడార్ పై ఆడుతుండగా కిందపడి మరణించాడు. ఉపాధ్యాయుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

పర్యవేక్షణ కరువు

గురుకులంలో పర్యవేక్షణ కరువైంది. విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పాల్సిన గురువులు చీకటి పడగానే ఇంటికి వెళ్తున్నారు. దీంతో రాత్రి వేళ విద్యార్థులను చూసే వారే కరువయ్యారు. రూ.కోట్లు వెచ్చించి భవనాలు నిర్మించినా ఉపాధ్యాయులు స్థానికంగా లేకపోయినా అధికారులు పట్టించుకోవంలేదు.



గేటు బయట నుంచే కొడుకును ఓదారుస్తున్న తల్లి

విద్యార్థి మృతిపై విచారణ చేపట్టాల్సిందే

హుస్నాబాద్: సాక్షాత్తు మంత్రి పొన్నం ఇలాకాలోని గురుకులంలోనే విద్యార్థులకు రక్షణ కరువైందని బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. విద్యార్థి వివేక్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బుధవారం హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో బాధిత కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్లే విద్యార్థి మృతి చెందాడన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బీలు నాయక్, సుద్దాల చంద్రయ్య, తిరుపతిరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కేటీఆర్ ఆరా

హుస్నాబాద్: గురుకుల పాఠశాలలో విద్యార్థి వివేక్ మృతిపై బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరా తీశారు. విద్యార్థి ఏ తరగతి చదువుచున్నాడు, మృతికి గల కారణాలపై హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్‌కు ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు. పార్టీ నాయకులు వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం కల్పించాలని ఆదేశించినట్లు సమాచారం. అలాగే గురుకుల పాఠశాల అధికారులు విద్యార్థి అంత్యక్రియల కోసం రూ.10 వేలు అందజేశారు.

పరిషత్ సంగ్రామం

నేడే తొలి విడత ఎన్నికల నోటిఫికేషన్





పల్లెల్లో ఓట్ల పండుగ మరూ అయ్యింది. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. జిల్లాలో పరిషత్ ఎన్నికలు రెండు విడతల్లో, గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడుతల్లో జరగనున్నాయి. ఈ మేరకు గురువారం తొలి విడతలో జరిగే పరిషత్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఇందుకోసం జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

–సాక్షి, సిద్దిపేట

- 15 జెడ్పీటీసీలు, 125 ఎంపీటీసీలకు నామినేషన్ల స్వీకరణ
- సర్వం సిద్ధం చేసిన జిల్లా యంత్రాంగం
- హైకోర్టు తీర్పుపై ఆశావహుల్లో టెన్షన్

జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు రెండు విడతలలో జరగనున్నాయి. మొదటి విడతలో 15 జెడ్పీటీసీలు, 125 ఎంపీటీసీలు, రెండో విడతలో 11 జెడ్పీటీసీలు, 105 ఎంపీటీసీ స్థానాలకు నిర్వహించనున్నారు. మొదటి విడతకు సంబంధించి ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. 12న నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల జాబితా, 13వతేదీ వరకు అప్పీల్‌కు అవకాశం, 14న అప్పీళ్ల పరిష్కారం, 15న నామినేషన్ల ఉపసంహరణ, మధ్యాహ్నం 3గంటలకు పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితా ప్రకటన చేయనున్నారు. ఈ నెల 23న ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 11న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఇప్పటికే ఆర్వో, ఏఆర్వోలను నియమించి నామినేషన్ల స్వీకరణ, నిబంధనల గురించి శిక్షణ ఇచ్చారు.

ముహూర్తాలు చూస్తున్న అభ్యర్థులు

ఎంపీటీసీ, జెడ్పీటీసీగా పోటీచేసే అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు ముహూర్తాలను తెలుసుకుంటున్నారు. ఈ మూడు రోజుల్లో కలిసి వచ్చే రోజును తెలుసుకుని నామినేషన్లను వేసేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే ఆయా పార్టీలు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వేగం చేశాయి. గెలిచే అభ్యర్థులను ఎంపిక చేసేపనిలో నిమగ్నమయ్యారు.

మొదటి విడత జరిగేవి ఇవే..

జెడ్పీటీసీ	ఎంపీటీసీల సంఖ్య
సిద్దిపేట అర్బన్	07
సిద్దిపేట రూరల్	08
నారాయణరావుపేట	05
చిన్నకోడూరు	14
నంగునూరు	11
దుబ్బాక	10
అక్బర్‌పేట భూంపల్లి	09
మిరుదొడ్డి	07
దౌల్తాబాద్	09
తొగుట	08
చేర్యాల	12
కొమురవెల్లి	06
రాయపోలు	08
ధూళ్మిట్ట	05
మద్దూరు	06

కొనసాగుతున్న టెన్షన్

ఎంపీటీసీ, జెడ్పీటీసీగా పోటీ చేయాలనుకున్న ఆశావహుల్లో ఇంకా టెన్షన్ కొనసాగుతోంది. బీసీ రిజర్వేషన్ల పై హైకోర్టులో కేసు గురువారానికి వాయిదా వేసింది. హైకోర్టు ఏమి ప్రకటిస్తుందోనని ఆసక్తిగా చూస్తున్నారు. షెడ్యూల్ ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని అన్ని రాజకీయ పార్టీలు సమాయత్తం అవుతున్నాయి.

సెటిల్‌మెంట్లు జాన్తానై..

- రాజకీయ నాయకులు పరిధి దాటొద్దు
- రౌడీమూకలపై ఉక్కుపాదం
- ప్రజల రక్షణే ముఖ్యం
- ప్రశాంత వాతావరణంలో 'స్థానిక' ఎన్నికలు
- పకడ్బందీగా పోలీసింగ్ వ్యవస్థ
- చిట్‌చాట్‌లో సీపీ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న సీపీ విజయ్ కుమార్

సాక్షి, సిద్దిపేట/సిద్దిపేట కమాన్: 'ప్రజా కేంద్రిత పోలీసింగ్ వ్యవస్థను పకడ్బందీగా కొనసాగించేందుకు టీం వర్క్‌తో ముందుకు సాగుతాం. ప్రజల భద్రతకు, రక్షణకు పెద్దపీట వేస్తాం. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటాం. రౌడీలు, గుండాయిజం, సెటిల్‌మెంట్లు చేసే వారిపై ఉక్కుపాదం మోపుతాం' అని పోలీస్‌కమిషనర్ ఎస్‌ఎం విజయ్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఆయన విలేకరులతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే..

వివాహిత మహిళలపై వేధింపుల కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని నా దృష్టికి వచ్చింది. భరోసా, స్నేహిత సెంటర్లలో కౌన్సెలింగ్ ద్వారా పరిష్కారం కానీ కేసులను నమోదు చేస్తున్నాం. జిల్లాలో అనేక సమస్యలపై దృష్టి సారించి, ప్రజల రక్షణ, లా అండ్ ఆర్డర్‌కు అనుగుణంగా పని చేస్తాం. పేకాట, గంజాయి, అక్రమ ఇసుక రవాణ, ఇతర అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతాం.

సెటిల్‌మెంట్లకు తావులేదు..

భూ తగాదాలు, వివిధ గొడవల నేపథ్యంలో పోలీస్‌స్టేషన్లకు ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిలో కొందరు రాజకీయ నాయకులు మధ్యవర్తిగా వ్యవహరిస్తూ సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. అలాంటివి ఇక బంద్ చేయాలి. సెటిల్‌మెంట్లకు తావులేకుండా పోలీస్ అధికారులు కేసులు నమోదు చేయాలి. సాక్ష్యాలు సేకరించి చార్జీషీట్ ఫైల్ చేసి చట్టప్రకారం ముందుకు వెళ్లాలి. పోలీసులు పోలీసింగ్ చేయాలి. రాజకీయ నాయకులు రాజకీయాలు చేసుకోవాలి. ఎవరూ పరిధి దాటొద్దు. సెటిల్‌మెంట్లు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవు. ఎన్నికలు ప్రశాంత వాతవరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటాం. దీని కోసం ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలి. జిల్లాలో ఇప్పటి వరకు 94 సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించాం. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ రౌడీయిజం, గుండాయిజం చేసేవాళ్లను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా నంగునూరు మండలంలో రాజకీయ నాయకులు ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేశారు.

ఎవరికీ డబ్బులివ్వొద్దు

జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో పోస్టుమార్టం కోసం ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వొద్దు. ఇది ఉచితంగా చేయాల్సిన పని. పోస్టుమార్టం కోసం బాదితుల నుంచి పోలీసులు, వైద్య సిబ్బంది డబ్బులు వసూలు చేస్తే నేరం. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం.

డ్రగ్స్‌ను తరిమికొడదాం

మీ కుటుంబ సభ్యుల్లో ఎవరైనా డ్రగ్స్‌కు అలవాటైతే పోలీసులకు సమాచారం అందించాలి. యువత ఎక్కువగా డ్రగ్స్ బారిన పడుతున్నట్లు, మత్తుకు బానిస అవుతున్నట్లు దృష్టికి వచ్చింది. 'డ్రగ్స్'పై నిఘా ముమ్మరం చేస్తాం. అందరం సమష్టి కృషితో డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలి.

ఇసుక అక్రమ రావాణాపై దృష్టి

ఇసుక, మట్టి రవాణా కోసం రెవెన్యూ, సంబంధిత అధికారుల అనుమతులు తీసుకోవాలి. అక్రమంగా రవాణ చేసే వారిని, సహకరించే వారిని ఉపేక్షించేది లేదు. క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. డీజేలకు అనుమతులు లేవు. మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటాం.

ఆన్‌లైన్ బెట్టింగ్‌ల జోలికి వెళ్లొద్దు

ఆన్‌లైన్ బెట్టింగ్‌లు నిర్వహించవద్దు. అలాగే ఆన్‌లైన్ లోన్ యాప్ జోలికి వెళ్లవద్దు. సైబర్ నేరాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలి. సైబర్ మోసానికి గురైతే 1930, సంబంధిత పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలి.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

- కలెక్టర్ హైమావతి
- అధికారులకు దిశానిర్దేశం

సిద్దిపేటరూరల్: జిల్లాలో స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ హైమావతి తెలిపారు. బుధవారం సీపీ విజయ్‌కుమార్, అదనపు కలెక్టర్లతో కలిసి 'స్థానిక' ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది విధులు తదితర అంశాలపై సబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పకడ్బందీగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకుని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉండాలన్నారు. ఎక్కడా లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

వైద్య సేవల్లో ముందుండాలి

సిద్దిపేటరూరల్: వైద్య సేవల్లో రాష్ట్రంలోనే జిల్లా ముందు వరుసలో ఉంచాలని కలెక్టర్ హైమావతి వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో వైద్య ఆరోగ్య శాఖ ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డెంగీ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే అప్రమత్తమై తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. డ్రైడే పాటించడంతోపాటు, శానిటేషన్ డ్రైవ్, మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌ఎంపీ డాక్టర్లు నిర్లక్ష్యంగా వైద్యం చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే వారిపై ఎఫ్‌ఐఆర్ లు నమోదు చేయాలని ఆదేశించారు. ముందస్తు అనుమతి లేకుండా సిబ్బందికి సెలవులు మంజూరు చేయరాదని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందించే వైద్య సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, జిల్లావైద్యాధికారి ధనరాజు, జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్, డాక్టర్లు, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

30 మద్యం దరఖాస్తులు

సిద్దిపేటకమాన్: జిల్లాలోని మద్యం దుకాణాలకు ఇప్పటివరకు 30 దరఖాస్తులు వచ్చినట్లు ఈఎస్ శ్రీనివాసమూర్తి, ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ.. జిల్లాలోని 93వైన్ షాప్‌ల నిర్వహణకు ఇప్పటి వరకు 30 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. సర్కిల్ వారీగా సిద్దిపేట పరిధిలో 12, గజ్వేల్ పరిధిలో 10, హుస్నాబాద్‌లో 6, చేర్యాలలో 2 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈనెల 18వరకు గడువు ఉందని తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

గజ్వేల్: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బాల్‌రాజు, యూత్ ప్రెసిడెంట్ వెంకట్‌తోపాటు పలువురు నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నర్సారెడ్డి మాట్లాడారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయాలతో ముందుకుసాగుతున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రూ.2 లక్షల రుణమాఫీ, సన్న బియ్యం, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వంటి కార్యక్రమాలతో గ్రామీణ సమాజంలో పరివర్తనకు నాందిపలుకుతున్నారని చెప్పారు. గత బీఆర్‌ఎస్ పాలన పూర్తిగా అవినీతిమయంగా సాగిందన్నారు. బీఆర్‌ఎస్ చేసిన మోసాలను వివరిస్తూ ధోకా కార్డుల పేరుతో ప్రజల్లోకి వెళ్తామని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ సర్దార్‌ఖాన్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నర్సారెడ్డి

పొదుపు చేస్తేనే జీవితం మలుపు: ఎమ్మెల్సీ

కొండపాక(గజ్వేల్): పొదుపును జీవన విధానంగా మార్చుకుంటేనే కుటుంబాలు బాగుపడుతాయని ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. కొండపాక మండలంలోని మర్పడ్గలోని విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రం ఆవరణలో బుధవారం విధాత పొదుపు సంఘం 21వ వార్షిక మహాసభను నిర్వహించారు. ఈసందర్భంగా యాదవరెడ్డి మాట్లాడుతూ ప్రతీ మనిషి సంపాదనలో కొంత సొమ్మును పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. సంఘ భవన నిర్మాణానికి ఎమ్మెల్సీ నిధులను కేటాయిస్తామన్నారు. సంఘం అధ్యక్షులు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ 2003లో ప్రారంభమైన పొదుపు సంఘం నేడు రూ. 51లక్షలతో లావాదేవాలు కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వంపై, బ్యాంకులపై ఆధారపడకుండా పేదలకు ఆర్థిక స్వావలంబన కల్పించాలన్నదే పొదుపు లక్ష్యమన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ. 3.70లక్షల లాభం డబ్బులను తిరిగి సభ్యులకు బోనస్ రూపంలో అందించామన్నారు. సంఘంలోని ప్రతీ పైసా జమ, ఖర్చుల విషయమై ఆడిట్ ఉంటుందన్నారు. సంఘం సభ్యులు గడీల కుమార్ మృతి చెందడంతో కుటుంబానికి రూ. 41 వేలు, పిండి మల్లయ్య కుటుంబానికి రూ. 16 వేల పొదుపు, బోనస్ డబ్బులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శివప్రసాద్, సంఘం కోశాధికారి రవీందర్, సభ్యులు పాల్గొన్నారు.



బోనస్ డబ్బులు అందజేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

క్లుప్తంగా

బస్సులో మర్చిపోయిన బ్యాగు అప్పగింత



ప్రయాణికురాలుకు బ్యాగును అప్పగిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

హుస్నాబాద్: బస్సులో మర్చిపోయిన బ్యాగును తిరిగి ప్రయాణికురాలికి అప్పగించి ఆర్టీసీ సిబ్బంది మానవత్వం చాటుకున్నారు. వివరాలు... సిద్దిపేట నుంచి హన్మకొండకు బస్సులో వెళ్లిన ప్రయాణికురాలు శోభారాణి బ్యాగును మరిచిపోయి హన్మకొండ పెట్రోల్ బంక్ వద్ద దిగింది. వెంటనే గమనించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బ్యాగులో 4 తులాల బంగారం, బట్టలు ఉన్నట్లు తెలిపింది. దీంతో పోలీసులు ఆర్టీసీ అధికారులకు ఫోన్ చేశారు. వెంటనే బస్సు డ్రైవర్ మల్లయ్య, కండక్టర్ శంకర్‌ను అప్రమత్తం చేశారు. సదరు మహిళకు సమాచారం అందించి తిరిగి హుస్నాబాద్ బస్టాండ్‌లో బ్యాగును అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కంట్రోలర్ లకావత్ హరి, సెక్యూరిటీ సిబ్బంది లకావత్ వెంకటేశ్, మహేందర్‌లకు ప్రయాణికురాలు ధన్యవాదాలు తెలిపింది.

34 మందికి జరిమాన

గజ్వేల్‌రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి కోర్టు జరిమాన విధించింది. గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి వివరాల ప్రకారం... గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన చౌరస్తాల వద్ద ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో 34మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని బుధవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ఎదుట హాజరుపర్చగా 34 మందికి రూ. 50వేల జరిమానతో పాటు, ఓ వ్యక్తికి ఒక రోజు జైలు శిక్ష విధించారు.

మృతదేహం లభ్యం

జహీరాబాద్: కోహీర్ మండలం గురుజువాడలోని వ్యవసాయ బావిలో నుంచి వ్యక్తి మృతదేహం బుధవారం మధ్యాహ్నం లభ్యమైంది. మూడు రోజుల క్రితం బావిలో ఈతకు వెళ్లి గల్లంతయిన మహ్మద్ ఆషిక్అలీ (42) మృతదేహాన్ని బావిలో నుంచి వెలికి తీశారు. బావి లోపలి భాగంలో మృతదేహం చిక్కుకుపోవడంతో వెలికి తీసే విషయంలో ఇబ్బందులు తలెత్తాయి. బావిలోని నీటిని తోడేందుకు రెవెన్యూ, పోలీసులు, అగ్నిమాపక శాఖల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పది మోటార్లను బిగించి రెండు రోజుల పాటు నీటిని తోడించారు. దీంతో మృతదేహం బయట పడింది. ఆషిక్అలీ మరణానికి గల కారణాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ఈత రాక మరణించాడా లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే విషయమై కోహీర్ పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

విద్యార్థి అంత్యక్రియలు పూర్తి

సంఘీభావంగా విద్యా సంస్థల బంద్



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

నంగునూరు(సిద్దిపేట): హుస్నాబాద్‌లోని జిల్లెల్లగడ్డ గురుకుల పాఠశాలలో మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విద్యార్థి సనాదుల వివేక్ (13) అంత్యక్రియలు అతని స్వగ్రామం నంగునూరులో బుధవారం ముగిశాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహం గ్రామానికి చేరుకోగానే స్థానిక నాయకులు, యువకులు, విద్యార్థులు వివేక్ మృతదేహానికి నివాళులర్పించారు. తల్లి లావణ్య, తండ్రి సత్యనారాయణ, అతని కుటుంబ సభ్యులను ఓదార్చి అంత్యక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి కుటుంబానికి సంఘీభావం తెలుపుతూ నంగునూరు లోని ఉన్నత, ప్రాథమిక పాఠశాల, అక్కేనపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థులు తరగతులు బహిష్కరించి బంద్ పాటించారు. వివేక్ మృతదేహనికి నివాళులర్పించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీకి రూ.21.65 కోట్ల ఆదాయం

- నంస్థకు దసరా ధమాకా
- రద్దీకి అనుగుణంగా సర్వీసులు
- 40,76,734 మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేత



నారాయణఖేడ్: బస్సువద్ద ప్రయాణికుల రద్దీ

గ్రామాల్లో ఇంటిల్లిపాదితో సంబురంగా జరుపుకునే దసరాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు కల్పిస్తూ రీజియన్ పరిధిలో మంచి ఆదాయాన్ని సమకూర్చుకుంది. ప్రయాణికుల రద్దీకనుగుణంగా ప్రత్యేక బస్సులు నడిపి గమ్యస్థానాలకు చేర్చింది.

నారాయణఖేడ్: దసరా పర్వదినం ముందు గత నెల 20 నుంచి ఈనెల 2వ వరకు అనంతరం దసరా తర్వాత ఈనెల 4నుంచి 7వ తేదీవరకు 435 ప్రత్యేక బస్సులు నడిపింది. ఈ సర్వీసుల ద్వారా రీజియన్ పరిధిలో మహాలక్ష్మి ప్రయాణికులు 27,92,286మందిని, ఇతరులు 12,84,448మందిని వారి వారి గమ్యస్థానాలకు చేర్చి రూ.21.65కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకుంది. మెదక్ రీజియన్ పరిధిలోని 8 డిపోల నుంచి స్పెషల్ బస్సులను నడిపింది. 36,20,551కిలోమీటర్ల మేర బస్సులను తిప్పి 40,76,734మంది ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు చేర్చింది. ప్రయాణికుల రద్దీ అధికంగా ఉన్నా కార్మికులను డబుల్ డ్యూటీలకు పంపించి ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చింది. అన్ని డిపోల మేనేజర్లు ఎప్పటికప్పుడు రద్దీని పర్యవేక్షిస్తూ ప్రయాణికులు ప్రైవేట్ వాహనాల్లో కాకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించేలా వారికి సదుపాయాలు కల్పించారు.

కార్మికులకు తక్షణం చెల్లింపులు

రీజియన్ పరిధిలో అన్ని డిపోల పరిధిలో దసరా ప్రయాణికుల రద్దీ విపరీతంగా కొనసాగింది. హైదరాబాద్‌తోపాటు ఆయా ప్రాంతాల్లో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నవారు. విద్య, ఉద్యోగాలకోసం ఆయా ప్రాంతాల్లో ఉన్న వారు దసరా పండక్కి తమ స్వగ్రామాలకు వచ్చారు. కార్మికుల సంఖ్య తక్కువగా ఉన్నా ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవకుండా ఆర్టీసీ అధికారులు డ్రైవర్, కండక్టర్లకు డబుల్ డ్యూటీలు వేశారు. డిపోల్లో కొన్ని గంటలు విశ్రాంతి తీసుకునేందుకు సదుపాయాలు కల్పించారు. డబుల్ డ్యూటీ చేసిన డ్రైవర్‌కు రూ.1,000, కండక్టర్‌కు రూ.710ల చొప్పున డీడీ (డబుల్ డ్యూటీ) డబ్బులను స్పాట్‌లో డ్యూటీ దిగగానే చెల్లించారు. దీంతోపాటు కార్మికులు హోటళ్లలో తినేందుకు సమయం సరిపోక ఇబ్బందులు పడకుండా ఉండేందుకు డీఎంలు వెజ్‌బిర్యానీ పొట్లాలను డ్రైవర్, కండక్టర్లకు అందజేశారు. సంస్థకు మంచి ఆదాయం సమకూర్చి ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చినందుకు కార్మికులకు మిఠాయిలు సైతం పంపిణీ చేశారు.

డిపో	మహాలక్ష్మి ఆదాయం (రూ.లక్షల్లో)	మహాలక్ష్మి ప్రయాణికులు	నగదు ఆదాయం (రూ.లక్షల్లో)	నగదు చెల్లించిన ప్రయాణికులు	మొత్తం ఆదాయం (రూ.లక్షల్లో)	మొత్తం ప్రయాణికులు
దుబ్బాక	97.14	2,30,377	49.73	75,140	146.87	3,05,517
గజ్వేల్- ప్రజ్ఞాపూర్	213.96	5,27,780	99.71	1,72,621	313.67-	7,00,401
మెదక్	211.84	5,27,214	144.25	2,22,987	356.09	7,50,201
నారాయణఖేడ్	105.4	1,56,193	94.08	1,06,089	199.48	2,62,282
నర్సాపూర్	72.69	1,91,478	33.83	68,258	106.52	2,59,736
సంగారెడ్డి	200.25	4,95,105	156.62	2,27,825	356.87	7,22,930
సిద్దిపేట	186.67	3,99,101	170.32	2,07,666	356.99	6,06,767
జహీరాబాద్	154.31	2,65,038	174.76	2,03,862	329.07	4,68,900
మెదక్ రీజియన్	1242.26	27,92,286	923,3	12,84,448	2,165.56	40,76,734

ప్రయాణికుల సేవకు ఎల్లప్పుడూ సిద్ధం



ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణం అందించడమే ఆర్టీసీ లక్ష్యం. అందుకనుగుణంగా పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రయాణికుల అవసరం మేరకు సర్వీసులు నడిపి వారికి సేవలు అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాం. ప్రయాణికులు కూడా సురక్షితమైన ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించి సంస్థ మనుగడకు సహకరించాలి.

–మల్లేశయ్య, డీఎం, నారాయణఖేడ్

సమష్టి కృషి ఫలితం



ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న కార్మికులు అందరం సమష్టిగా కృషి చేసి దసరా సందర్భంగా ప్రత్యేక సర్వీసులు నడిపి రూ.21.65కోట్ల ఆదాయం సంపాదించాం. 36,20,551కిలోమీటర్ల మేర బస్సులను తిప్పి 40,76,743మంది ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు చేర్చాం. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు సర్వీసులను నడిపాం.

– విజయభాస్కర్, రీజినల్ మేనేజర్, సంగారెడ్డి

న్యాయం జరిగే వరకు పోరాటం

- బీఎంఎస్ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్
- ఏపీఎల్ అపోలో పరిశ్రమ కార్మికులు నిరవధిక సమ్మె



ఏపీఎల్ అపోలో పరిశ్రమ వద్ద సమ్మెలో కూర్చున్న కార్మికులు

చేగుంట(తూప్రాన్): అపోలో పరిశ్రమ కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని బీఎంఎస్ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ అన్నారు. బుధవారం వడియారం శివారులోని ఏపీఎల్ అపోలో పరిశ్రమ కార్మికులు నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ అపోలో పరిశ్రమలో యాజమాన్యం సీనియార్టీ ఉన్న ఉద్యోగులను అక్రమ బదిలీ చేసిందని ఆరోపించారు. కార్మికులకు న్యాయం చేయాలని తోటి కార్మికులు సమ్మెలో పాల్గొన్నట్లు తెలిపారు. యాజమాన్యం మొండి వైఖరి విడనాడి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు నర్సింహారెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.

తనువు చాలించి.. నలుగురికి పునర్జన్మ ప్రసాదించి..

- ఈశ్వర్ అవయవాలు దానం
- పుట్టెడు దుఃఖంలోనూ పెద్దమనసు చాటుకున్న కుటుంబం



ఈశ్వర్ (ఫైల్)

వర్గల్(గజ్వేల్): అతనో కార్పెంటర్. అనూహ్యంగా ప్రమాదానికి గురయ్యాడు. భవనం పైనుంచి జారి పడ్డాడు. కోమాలోకి వెళ్లాడు. బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. అయితే.. పుట్టెడు దుఃఖం దిగమింగుకుని పెద్ద మనసుతో అతని అవయవదానానికి కుటుంబీకులు అంగీకరించడంతో.. తాను తనువు చాలిస్తూ అవయవదానం ద్వారా నాలుగు కుటుంబాల్లో వెలుగులు నింపాడు సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మాలపల్లికి చెందిన కమటం ఈశ్వర్. కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నెంటూరు పంచాయతీ పరిధిలోని మాలపల్లికి చెందిన ఈశ్వర్(54) కార్పెంటర్‌గా పనిచేస్తాడు. అతనికి తల్లి సత్తమ్మ, భార్య శైలజ, నిహార్, మనీష్, త్రిపూజ ముగ్గురు పిల్లలున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఈశ్వర్ ప్రమాదవశాత్తు గ్రామంలోని ఓ భవనం పైనుంచి జారి పడిపోవడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతనిని చికిత్స కోసం యశోద ఆసుపత్రికి తరలించారు. అతడు కోమాలోకి వెళ్లిపోగా, పరిస్థితి పూర్తిగా విషమించిందని, బతకడని వైద్యులు పేర్కొన్నారు. ఈ వార్తతో కుటుంబం దుఃఖ సాగరంలో మునిగిపోయింది. అంతటి విషాదంలోనూ పెద్దమనసుతో ఈశ్వర్ అవయవదానానికి వారు అంగీకారం తెలిపారు. దీంతో బుధవారం ఉదయం జీవన్‌దాన్ ద్వారా వైద్యులు కండ్లు, గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీలు, లివర్ సేకరించారు. అవయవదానంతో మరో నలుగురికి ప్రాణదానం, నాలుగు కుటుంబాల్లో వెలుగులు నింపిన ఈశ్వర్ కుటుంబీకులు అందరి ప్రశంసలు చూరగొన్నారు. ఈశ్వర్ భౌతికంగా లేకపోయినా అవయవ దానంతో మరో నలుగురికి జీవితం ప్రసాదించాడని కొనియాడారు. బుధవారం అశ్రునయనాల మధ్య కుటుంబీకులు, బంధువులు గ్రామంలో ఈశ్వర్ అంత్యక్రియలు నిర్వహించారు.

నకిలీ పత్రాలు సృష్టించి ప్లాట్ విక్రయం

నలుగురు నిందితుల అరెస్టు



వివరాలు తెలుపుతున్న సీఐ ఉపేందర్, ఎస్‌ఐ ఆసిఫ్

సిద్దిపేటకమాన్: నకిలీ పత్రాలు సృష్టించి లేని భూమిని ఉన్నట్లు చూపించి ప్లాట్‌ను విక్రయించిన నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన సిద్దిపేటలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కుషాల్‌నగర్ సర్వే నంబర్ 1299లో భూమి లేకున్నా 90 చదరపు గజాల ప్లాట్ ఉన్నట్లు పట్టణానికి చెందిన రమణగౌడ్, నరేందర్, రమేష్, చంద్రశేఖర్‌లు నకిలీ పత్రాలు సృష్టించి రామరాజు వెంకటేష్‌కు రూ.12లక్షలకు గతంలో విక్రయించారు. అనంతరం వెంకటేశ్ అట్టి ప్లాట్‌లో ఇంటి నిర్మాణానికి ప్రయత్నించగా ప్లాట్ అసలు యజమాని వచ్చి అడ్డుకున్నాడు. దీంతో వెంకటేష్ మోసపోయినట్లు గ్రహించి విక్రయించిన వారిని డబ్బులు అడగగా.. ఇవ్వకపోవడంతో పై నలుగురిపై బాధితుడు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్‌ఐ ఆసిఫ్ దర్యాప్తులో ప్లాట్ పత్రాలు సేకరించి నకిలీ పత్రాలు సృష్టించి విక్రయించినట్లు గుర్తించారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ఎల్లయ్య

నిజాంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మేడ్చల్ జిల్లాలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన కొమ్మాట పోచవ్వ, మల్లయ్య దంపతుల నాలుగో కుమారుడు మొద్దు ఎల్లయ్య(28) మేడ్చల్‌లో కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గొర్రెల కాపరులపై దాడి

నగదు, ఫోన్లు లాక్కున్న దుండగులు

నర్సాపూర్‌రూరల్: గొర్రెల కాపరులపై దాడి చేసి దుండగులు నగదు, ఫోన్లు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి వివరాల ప్రకారం... నారాయణపేట జిల్లా దామరగిద్దకు చెందిన బాధితులు రేనివట్ల నర్సింహ అతని మామ బజారు రామప్ప తమ గొర్రెలను మేత కోసం మెదక్ జిల్లాలోని పలు చోట్ల తిప్పుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి నర్సాపూర్ శివారులోని ఓ రైస్‌మిల్లు వద్ద గొర్రెలను మంద పెట్టారు. అనంతరం మెదక్‌కు వెళ్లేందుకు రోడ్డుపైకి వచ్చారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి మెదక్ వైపు వెళ్తున్న ఓ కారు వారి వద్దకు వచ్చి ఆగింది. మెదక్‌కు వెళ్తున్నామని, వందరూపాయల కిరాయి అవుతుందని చెప్పి వారిని కారులో ఎక్కించుకున్నారు. ఈ క్రమంలో నర్సాపూర్ శివారు దాటగానే కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులు నర్సింహ, రామప్పపై దాడి చేశారు. వారి వద్ద ఉన్న రూ.8వేల నగదును, సెల్‌ఫోన్‌ను లాక్కెళ్లారు. కాగా బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముగ్గురిపై కేసు నమోదు

- యువకుడి తల్లిని కొట్టి చంపిన ఘటనలో..
- పోలీస్ పహారాలో అంత్యక్రియలు



బస్వాపూర్‌లో మృతురాలి ఇంటి వద్ద గూమిగూడిన జనం

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రేమికుడి తల్లిని కొట్టిచంపిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదైంది. ఎస్‌ఐ కృష్ణారెడ్డి వివరాల ప్రకారం... మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన షాహింబేగం కొడుకు అబ్బాస్ అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కాగా నచ్చని యువతి తల్లిదండ్రులు, బాబాయి కలిసి మంగళవారం సాయంత్రం అబ్బాస్ తల్లిని కొట్టిచంపారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం గ్రామానికి మృతదేహాన్ని తీసుకురాగా గ్రామస్తులు ఆమెను చూసేందుకు తరలివచ్చారు. అనంతరం వట్టిపల్లి గ్రామంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. హత్యా నేరం కింద ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కొడుకు అబ్బాస్ తల్లి మృతదేహాన్ని చూసి బోరున విలపించాడు. ఇద్దరం ఇష్టపడే పెళ్లి చేసుకున్నామని, తల్లిని చంపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వేధిస్తున్నాడని అంతం చేశారు

- భార్య, కుమారులు, మరికొందరు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ



వివరాలు వెల్లడిస్తున్న గజ్వేల్ ఏసీపీ నర్సింహులు

కొండపాక(గజ్వేల్): భర్తను హత్య చేయించిన కేసులో భార్యతో పాటు కుమారులు, మరికొందరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ ఏసీపీ నర్సింహులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వెల్లడించారు. తిప్పారం గ్రామానికి చెందిన సింధు సంతోషతో కరీంనగర్ జిల్లాకు చెందిన మహేందర్‌తో కొన్నేళ్ల కిందట వివాహం జరిగిందన్నారు. మహేందర్ మద్యం తాగి వచ్చి తరుచూ భార్యతో గొడవపడేవాడరన్నారు. దీంతో బాధలు భరించలేక భార్య తమ కుమారులతో తిప్పారానికి వచ్చి ఉంటోంది. అయినా భర్త వచ్చి వేధిస్తుండటంతో ఈ నెల 4న భర్తపై తీవ్రంగా దాడి చేశారు. దీంతో ఆర్ఎంపీ వైద్యుడిచే చికిత్స చేయించుకొని వచ్చి మళ్లీ గొడవ పడ్డారన్నారు. భార్య సంతోష.. తన ఇద్దరు తమ్ముళ్లు, కొడుకులు, పరిచయం ఉన్న వ్యక్తి సహాయంతో మహేందర్‌ను ఆటోలో తీసుకెళ్లి గ్రామ శివారులో గల కూడవెల్లి వాగులో పడేశారన్నారు. ఈనెల 6న వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించడంతో బయటకు తీశారు. జేబులో దొరికిన ఆధార్ కార్డు ఆధారంగా మృతుడు మహేందర్‌గా గుర్తించారన్నారు. మృతుడి భార్య సంతోషను, సహకరించిన వ్యక్తి ఎల్లయ్యను విచారించగా హత్య చేసిన విషయాన్ని ఒప్పుకున్నారన్నారు. దీంతో నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించగా కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు

నా అంతిమయాత్రకైనా దారివ్వండి



సుభాశ్‌రెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): ఇంటికి వెళ్లేందుకు దారి ఇవ్వకుండా మూసివేసినా, తన సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ పురుగు మందు సేవించిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మండల పరిధిలోని వాడి గ్రామానికి చెందిన బూర్గుపల్లి సుభాశ్‌రెడ్డి(44) కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన పాలివారు తన ఇంటి వద్దకు వెళ్లేందుకు దారి ఇవ్వకుండా మూసివేశారు. దీంతో మండల, జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఈనెల 3న పురుగు మందు సేవించాడు. తాను మృతిచెందిన తర్వాత తన సమస్యను పరిష్కరించి, ఆ దారి వెంటే తన మృతదేహాన్ని తీసుకెళ్లాలంటూ అధికారులకు విన్నవించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

గ్రామంలో ఉద్రిక్తత, భారీ బందోబస్తు



బంధువులను సముదాయిస్తున్న సీఐ జార్జ్

సుభాశ్‌రెడ్డి మృతికి కారణమైన వారిని శిక్షించి సమస్యను వెంటనే పరిష్కరించాలంటూ బంధువులు పెద్ద ఎత్తున గ్రామానికి చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మృతికి కారణమైన వారిని శిక్షించి కుటుంబానికి న్యాయం చేయాలని పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ రూరల్ సీఐ జార్జ్, ఎస్‌ఐ నరేశ్ ముందస్తు జాగ్రత్తగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సుభాశ్‌రెడ్డి ఇంటి వద్దకు వెళ్లకుండా అడ్డంగా ఉంచిన గేట్‌ను తొలగించారు. మృతుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని హామీ ఇచ్చే వరకు అంత్యక్రియలు నిర్వహించమబోమంటూ మొండికేశారు. మృతుడికి భార్య అనూష, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

హుస్నాబాద్: పట్టణంలోని 5వ వార్డుకు చెందిన జొన్నలగడ్డ నర్సయ్య (43) బుధవారం ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. తన కూతురిని కిరాణ షాపుకు వెళ్లి సామాన్లు తీసుకు రమ్మని పంపించి ఉరి వేసుకున్నాడు. కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనాస్థలికి పోలీస్‌లు చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెట్రోల్ దాడిలో వ్యక్తి మృతి



యోహాన్

చేగుంట(తూప్రాన్): పెట్రోల్ దాడిలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు... మండలంలోని వడియారం గ్రామంలో ఈనెల 3న అర్ధరాత్రి సమయంలో బైకు దొంగతనం చేశాడనే అనుమానంతో యోహాన్(32)పై దాడి చేయడంతో పాటు పెట్రోల్ పోసి నిప్పటించారు. మరోవ్యక్తి మహిపాల్‌పై కూడా దాడి చేసారు. కాగా ఈ దాడిలో గాయపడిన చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామానికి చెందిన యోహాన్(అలియాస్ మోహన్) గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ కేసులో ఇప్పటికే పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వివాహిత అదృశ్యం



ధ్రతి

పటాన్‌చెరు టౌన్: వివాహిత అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మధ్యప్రదేశ్‌కు చెందిన అతుల్ అనే వ్యక్తి మూడు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకొని ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఉంటూ సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 4న అతుల్ డ్యూటీకి వెళ్లడంతో ఇంటి వద్ద ఉన్న భార్య ధ్రతి సాయంత్రం ఐదు గంటలకు భర్తకు ఫోన్ చేసి నేను ఇంటి నుంచి బయటకు వెళ్తున్నట్లు చెప్పి వెళ్లింది. ఎంతకూ రాకపోవడంతో భార్య కోసం అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

తూప్రాన్: అజాగ్రత్తగా స్కూల్ బస్సును నడుపుతూ బైక్‌ను ఢీకొట్టిన బస్సు డ్రైవర్‌పై కేసు నమోదైంది. ఎస్‌ఐ శివానందం వివరాల ప్రకారం... పట్టణ పరిధిలోని పోతరాజుపల్లి గ్రామ సమీపంలోని ఓ స్కూల్ బస్సు డ్రైవర్ పులకంటి శ్రీనివాస్ గీతారెడ్డి కాలనీ వద్ద బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై ఉన్న మనోహరాబాద్ మండలం జీడిపల్లి గ్రామానికి చెందిన పూస నర్సింగ్‌రావుకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

అత్యాచారం కేసులో యావజ్జీవం

- రూ.1.50 లక్షల జరిమానా
- సిద్దిపేట మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు తీర్పు
- పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాధితురాలిపై అత్యాచారం చేసిన శాంతరాజు
- 2019లో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు
- అప్పట్నుంచి కోర్టులో ఏడేళ్లపాటు కొనసాగిన విచారణ

సిద్దిపేటరూరల్: ఓ ఉపాధ్యాయురాలిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి, అత్యాచారం చేసినందుకుగాను ఓ నేరస్థుడికి యావజ్జీవ కారాగారశిక్షతో పాటు రూ.1.50లక్షల జరిమానాను విధిస్తూ మొదటి అదనపు జిల్లా కోర్టు బుధవారం తీర్పునిచ్చింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మహిళ ములుగు మండలంలోని ఒక పాఠశాలలో కాంట్రాక్టు ఉపాధ్యాయురాలిగా పనిచేసేది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా సీతారాంనగర్ మండలం, సింగవరం గ్రామానికి చెందిన పైడి శాంతరాజు ప్రస్తుతం హైదరాబాద్‌లోని చింతల్ పద్మానగర్‌లో నివాసముంటున్నాడు. శాంతరాజు 2014లో తన పిల్లలను ఆ మహిళ పనిచేస్తున్న స్కూల్లో చేర్పించాడు. పిల్లల బాగోగులు తెలుసుకునేందుకు ఉపాధ్యాయురాలి ఫోన్ నంబర్ తీసుకుని అప్పుడప్పుడూ మాట్లాడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో పెళ్లి చేసుకుంటానని నమ్మించి 2014 డిసెంబర్ నెలలో ఆమెను అల్వాల్‌కు రమ్మని ఫోన్ చేయగా సదరు ఉపాధ్యాయురాలు అక్కడకు వెళ్లింది. ఈ క్రమంలో శాంతరాజు ఆమెను బలవంతంగా ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. అనంతరం ఆమెను పలుమార్లు శారీరకంగా వాడుకున్నాడు. పెళ్లి విషయం ఎత్తేసరికి ముఖం చాటేస్తుండటంతో శాంతరాజు తనను నమ్మించి మోసం చేశాడని 2019లో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సదరు టీచర్ ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ కోటేశ్వర్‌రావు కేసు చేసి విచారణ చేసి శాంతరాజును జ్యూడీషియల్ రిమాండ్‌కు పంపించారు. అనంతరం సాంకేతిక ఆధారాలతో నిందితుడిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అప్పట్నుంచి సిద్దిపేట మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జయప్రసాద్ ఎదుట వాదనలు కొనసాగాయి. విచారణలో శాంతరాజు నేరం రుజువుకావడంతో మానభంగం చేసినందుకు అతడికి యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.లక్ష జరిమానా, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసినందుకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.50 వేల జరిమానా విధిస్తూ జడ్జి జయప్రసాద్ తీర్పునిచ్చారు. ఈ కేసులో బాధితురాలికి రూ.5 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి సిఫారసు చేశారు. కాగా, నేరస్థుడికి జైలు శిక్ష పడేందుకు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యస్.ఆత్మ రాములు, ఎస్‌ఐ రాజేశ్, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, కోర్టు మానిటర్ ఎస్‌ఐ గంగరాజు, కోర్టు కానిస్టేబుల్ రవి, ఇతర సిబ్బందిని సీపీ అభినందించారు. త్వరలోనే వారికి రివార్డులు అందజేస్తానని తెలిపారు.